క్లుప్తంగా

మురుగు కాలువలను శుభ్రం చేయాలి



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలపైన ఏర్పాటు చేసిన నాపరాళ్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని షరాఫ్ బజారులోని మూర్తి కొండయ్య వీధిలో బుధవారం ఆమె పర్యటించారు. షరాఫ్ బజారులోని దుకాణాల ముందు ఉన్న కాల్వలపై రాళ్లు పరిచి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించి కాల్వలు బాగు చేయాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, 19వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు చుండూరు సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు ఉన్నారు.

నేలపాడులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



తెనాలి: పట్టణంలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి దత్తత గ్రామమైన రూరల్ మండలం నేలపాడులో కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం–1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈనెల 23వ తేదీ నుంచి గురువారం వరకు నిర్వహించనున్నారు. ప్రజల ఆహార అలవాట్లు, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలపై ప్రత్యేకమైన సర్వే చేయిస్తున్నారు. వీటితో పాటు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపైనా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పంచాయతీ కార్యాలయం నుంచి ప్రదర్శన చేశారు. నేలపాడు గ్రామ సర్పంచి సురవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎస్‌వీ శర్మ పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని కోనేటిపురంలోని అంకమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన హోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు వల్లూరు వరప్రసాద్ దంపతుల పర్యవేక్షణలో గ్రామంలోని ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో శివాలయం ఈఓ నరసింహమూర్తి, విశ్రాంత వీఆర్ఓ వల్లూరు వెంకట్రావు, కావూరి చంద్రమోహన్, తోట లక్ష్మయ్య, అమ్మిరెడ్డి హనుమంతరావు, నల్లిబోయిన నాగేశ్వరరావు, గుంటూరు రంగారావు, పోకల శివరామకృష్ణ పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానంతోనే మానవుని మనుగడ

మున్నంగి(కొల్లిపర): శాస్త్ర విజ్ఞానంతోనే మానవుని మనుగడ సాధ్యమని మున్నంగి ఎంపీపీఎస్(ఆర్) పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము అన్నారు. బుధవారం మండలంలోని మున్నంగిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఆయిల్ ల్యాంప్, అగ్నిపర్వతం, నీటిలో నడిచే ఎలక్ట్రానిక్ ఓడ, చంద్రయాన్–3 వంటి ప్రయోగ ప్రదర్శనలు పలువురి ఆకరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీకమల, జ్యోతి, సౌమ్య పాల్గొన్నారు.

కొల్లిపరలో ఓ ఇంట్లో చోరీ

కొల్లిపర: పట్టపగలే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటోకి వెళ్లి బీరువా తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ చేసిన ఘటన మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రావూరు నాగలక్ష్మి ఉదయం 10గంటలకు రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగం చేయటానికి వెళ్ళింది. మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారపు గాజులు, రెండు తులాల నల్లపూసల గొలుసు, 4 గ్రాముల ఉంగరం, రూ.2 వేలు నగదు చోరీకి గురికావటంతో వెంటనే ఈ విషయాన్ని కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవీంద్రరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆంగ్ల భాషపై పట్టు అవసరం

తెనాలిఅర్బన్: పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ ప్రాధాన్యత పెరిగిందని, భాషపై విద్యార్థులు పట్టు తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం కె.వెంకటేశ్వరరావు సూచించారు. సాఫ్ట్ స్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో చెంచుపేటలోని నారాయణ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆర్ఎస్‌టీ జీవన్, విద్యాసాగర్, ప్రమోద్ జోష్ పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రదర్శనకు అభ్యుదయ రైతులు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



రైతు విజ్ఞాన యాత్రకు బయలుదేరిన రైతులతో నున్న వెంకటేశ్వర్లు

తెనాలి: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లో ఈనెల 29వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్‌స్టేట్ ఎక్స్‌పోజర్ యూనిట్‌కు 15 మంది రైతుల బృందం బుధవారం సాయంత్రం గుంటూరు నుంచి బయలుదేరి వెళ్లింది. గుంటూరులోని అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో ఆ కార్యాలయం నుంచి రైతుల బృందం బెంగళూరుకు బయలుదేరింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. నాలుగురోజులపాటు జరిగే వ్యవసాయ ప్రదర్శనలు, సెమినార్లకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అభ్యుదయ రైతులను ఎంపిక చేశారు వీరిలో అభ్యుదయ రైతులు గొట్టుముక్కల శ్రీధర్(దావులూరు), కల్లం శివరామిరెడ్డి(నూతక్కి), వుయ్యూరు సాంబిరెడ్డి(కొల్లిపర), వంగా నవీన్‌రెడ్డి(జొన్నలగడ్డ), బి.రామమోహన్‌రావు (నిడుముక్కల), ఎం.చంద్రబాబు(పానుగుపాడు), గొట్టం నాసర్‌రెడ్డి (మిట్టగుడిపాడు), బొట్ల వెంకటనరసింహారావు(ఎ.ముప్పాళ్ల), బి.పరమేశ్వరరెడ్డి(సొలస, యడ్లపాడు), దరువూరి వాసు(కేఎం అగ్రహారం), పాతూరి శ్రీనివాసరావు (హుస్సేన్‌నగర్), గుర్రం హనుమంతరావు(శ్రీరుక్మిణీపురం), పిట్టు మోహన్‌రెడ్డి (సమ్మెటవారిపాలెం), నక్కా స్వామిరెడ్డి (మరుప్రోలువారిపాలెం), మంగ నాగసాయి (జంపని) ఉన్నారు. వీరికి గైడ్‌గా 'ఆత్మ' ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు వ్యవహరిస్తారు.

రేపటి నుంచి పసుపు రైతుల దీక్షలు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తెనాలి: దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం అందించాలని కోరుతూ మార్చి ఒకటి నుంచి మూడో తేదీ వరకు దీక్షలు నిర్వహించనున్నట్లు పసుపు రైతుల రాష్ట్ర కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య, కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. బాధిత రైతుల జాబితాలను బహిర్గతం చేయకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు స్థానిక ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రిలే దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఘటన జరిగిన 40 రోజులు గడిచినా రైతులకు తగిన హామీ దక్కలేదన్నారు. దీక్షలో మొక్కజొన్న, నిమ్మ రైతులు కూడా పాల్గొనాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, తెనాలి, దుగ్గిరాల మండలాల రైతుసంఘం అధ్యక్షులు ముద్దన సాంబశివరావు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, కొల్లూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న అప్పిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని శాసనమండలి విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయిన చెక్కుల్ని బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్ని బలోపేతం చేస్తూ వైద్యాన్ని మన గుమ్మం వద్దకు తెచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది అన్ని జబ్బుల్ని చేర్చారన్నారు. నేడు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి ఒక్కరికీ రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు సైతం సీఆర్ఎఫ్ కింద నగదు మంజూరు చేస్తూ ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడే పరిస్థితులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల్ని చేపట్టి తండ్రిని మించిన తనయుడుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా పరిపాలన చేస్తున్న మనస్సున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలబడాలని అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసరెడ్డి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెడ్ నర్సుగా రోజ్ రాణి సేవలు అభినందనీయం



రోజ్ రాణి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో హెడ్ నర్సుగా పని చేస్తున్న దాసరి రోజ్ రాణి బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు సేవ చేయడం వరంలా భావించి హెడ్ నర్స్ రోజ్ రాణి పని చేశారని అభినందించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్ వైద్య విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ టి.వి. శివరామకృష్ణ, డాక్టర్ జి. దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని పాల్గొన్నారు.

ఏఓగా విధుల్లో చేరిన ప్రతాప్‌బాబు

గుంటూరు జీజీహెచ్ పరిపాలనా అధికారిగా(ఏఓ) దేవరపల్లి ప్రతాప్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై జీజీహెచ్ ఏఓగా విధుల్లో చేరారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు అవకాశం

తాడేపల్లిరూరల్: పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసినట్లు తాడేపల్లి ఎంఈఓలు శాంతకుమారి, నాగేశ్వరరావు తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం ఒకటో తరగతిలో 25 ఉచిత ప్రవేశాల కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని, దీని ప్రకారం 24-02-2024 నుంచి 14-03-2024 వరకు అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఛిట్పః ఇజౌ ః.జీ ఃః అనేవెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలకు, హెచ్ఐవీ బాధితులకు 5శాతం, షెడ్యూల్ కులాలు 10, షెడ్యూల్ తెగలు 4, బలహీనవర్గాలు (బీసీ, మైనార్టీ, ఇతరులు) 6 శాతం రిజర్వేషన్ ఉంటుందని, దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ సచివాలయం, నెట్ సెంటర్, ఎంఈఓ. కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం ఏడాదికి లక్షా ఇరవై వేలు రూపాయలు, పట్టణ ప్రాంతంలో లక్ష నలభై నాలుగు వేల రూపాయలలోపు ఉండాలని, 1వ తరగతి ప్రవేశానికి అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14417ను సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

తుళ్లూరులో యువకుడి మృతదేహం లభ్యం

తాడికొండ: తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభించిందని సీఐ సుభాని తెలిపారు. వివరాలు.. తుళ్లూరు సీడ్ యాక్సెస్ రోడ్డు ఎండ్ పాయింట్ టీటీడీ కళ్యాణ మండపం దగ్గర గుర్తుతెలియని యువకుడు మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించినట్లు చెప్పారు. మృతదేహంపై గొంతు కుడివైపు పుట్టుమచ్చ, ఎడమ రొమ్ముపైన పుట్టుమచ్చ ఉన్నట్లు గుర్తించామని, ఎత్తు 5.10, చామనచాయ రంగులో బట్టతల ఉందని తెలిపారు. మృతుడు గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సమాచారం కాగా మృతికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్ళు లభించలేదని, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తన ఫోన్ 9440900860, ఎస్ఐ వేణుగోపాల్ ఫోన్ నంబర్ 967659642లకు సమాచారం అందించాలని కోరారు.

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 35వ వార్డు గంగానమ్మపేటలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఆమె పరిశీలించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, 35వ వార్డు కౌన్సిలర్ గౌడవర్తి శ్రీసాయిహరేరామ్, డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమార్, డాక్టర్ ముద్రకోల అనూరాధ, డాక్టర్ సిహెచ్ దేవకి, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, వినోద్ కుమార్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కఠెవరం గ్రామానికి స్వచ్ఛ సంకల్ప అవార్డు



జిల్లాపరిషత్ కార్యాలయ ఏఓ నుంచి అవార్డు అందుకుంటున్న కఠెవరం సర్పంచి ప్రసాద్

తెనాలిటౌన్: జగనన్న స్వచ్ఛ సంకల్ప అవార్డుకు రూరల్ మండలం కఠెవరం పంచాయతీ ఎంపికైంది. గుంటురులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బండికళ్ల ప్రసాద్ అవార్డును కార్యాలయ ఏఓ నుంచి అందుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు, స్వచ్ఛ సంకల్ప పనులు సకాలంలో చేయడంతో ఉత్తమ పంచాయతీగా కఠెవరం ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హుమాయూన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఈఓ భాస్కర్

తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఈఓ నన్నపనేని భాస్కర్ పేర్కొన్నారు. ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వీబీఎస్ అజయ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మేళా

తెనాలిఅర్బన్: నవరత్నాలు –పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న శాశ్వత స్థల హక్కు పథకం కింద ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారి కోసం గురువారం రిజిస్ట్రేషన్ మేళాను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 20,224 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగిందన్నారు. వారిలో ఇప్పటి వరకు 17,903 మందికి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వివరించారు. మిగిలిన వారు కూడా గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న మేళాలో పాల్గొని రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సూచించారు.

లోక్అదాలత్ వాయిదా

తెనాలిరూరల్: మార్చి 9వ తేదీ నిర్వహించాల్సిన జాతీయ లోక్అదాలత్ వాయిదాపడినట్లు గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి, తెనాలి మండల న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ కేఎస్ రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 16వ తేదీన లోక్అదాలత్ జరుగుతుందని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

మద్యం విక్రేతల అరెస్ట్

మంగళగిరి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి 140 మద్యం సీసాలతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సెబ్ డీఎస్ఈఓ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు సెబ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో మంగళగిరి సెబ్ కార్యాలయ పరిధిలోని తాడికొండ మండలం పొన్నెకల్లు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సీఐ పి.ప్రసన్నలక్ష్మి బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

అదే సమయంలో ఓ ద్విచక్ర వాహనంపై వెళుతున్న తాడికొండకు చెందిన యనమల కిషోర్, కనపర్తి నిఖిల్, మేడికొండూరు మండలం విశదలకు చెందిన చిలక రామకోటయ్యలను తనిఖీ చేసి వీరి వద్ద నుంచి 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేసింది, లబ్ధిదారులందరూ తమకు మేలు జరిగిందని భావిస్తే వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. 20వ వార్డులో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తెనాలి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, కొర్ర యశోద, కఠారి రత్నకుమారి, గుంటూరు కోటేశ్వరరావు, కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు దామర్ల విజయరాణి, కొల్లా గురునాథగుప్తా, గోల్డ్ రహిమా, షేక్ జాకీర్, కె.కిరణ్, షేక్ గఫూర్, పోతిరెడ్డి హేమలత, ఆలమూరి విజయలక్ష్మి, టెక్స్ బాల, కొమ్ము రాయల్, కఠారి హరీష్, సిరి కృష్ణ, చుండూరు సాయి, కాకి దేవసహాయం, టి.అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

పట్టణంలోని ఐదో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, తోట రఘురామ్, పేరం సంజీవరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాదం బాలగురమ్మ, కె. వెంకటేశ్వరరావు, టి.రమేష్ పాల్గొన్నారు.

వల్లభాపురంలో..

వల్లభాపురం(కొల్లిపర): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకీ ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే శివకుమార్ చిన్న కుమారుడు అఖిల్ గణేష్ కోరారు. మండలంలోని వల్లభాపురంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత, వంగా సుధాకరరెడ్డి, నగేష్‌రెడ్డి, అవుతు శేఖరరెడ్డి పాల్గొన్నారు.



మార్కెట్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తేలప్రోలులో..

తెనాలిటౌన్: రూరల్ మండలం తేలప్రోలులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ షేక్ బాషా, ఎంపీటీసీ సభ్యులు షేక్ ఇలియాజ్, కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఇంతియాజ్, ముజీర్ షేక్, మహ్మద్ ఫరీద్, సిద్దెల కోటేశ్వరరావు, కొండమూది దానయ్య పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోండి



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జేమ్స్‌మొరేలీ



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని నెహ్రూ నికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులు సీవీ రామన్, పలువురు శాస్త్రవేత్తల చిత్రపటాలను ప్రదర్శించారు. అలాగే కొందరు విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.

శాఖా గ్రంథాలయంలో...

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శాఖా గ్రంథాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పర్యవేక్షణలో పాఠశాలల విద్యార్థులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ప్రఖ్యాత శాస్త్రవేత్త రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న ఫిబ్రవరి 28 తేదీని జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుతున్నట్లు తెలిపారు.



సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మాంటిస్సోరి స్కూల్లో..

పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరీ స్కూల్లో సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈనెల 18న స్టీమ్ ఎక్స్‌పో–2024 పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జేమ్స్‌మొరేలీ బహుమతులు అందజేశారు.

మున్సిపాలిటీల్లో ఇంధన పొదుపు తప్పనిసరి

నగరపాలక సంస్థ ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి

నెహ్రూనగర్: మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరని నగరపాలక సంస్థ ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నగరపాలక సంస్థ పంప్ ఆపరేటర్లకు ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుందర్రామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు ఇంధన పొదుపు అంశంలో కీలకంగా ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపుకే వినియోగిస్తున్నందున, ఇతర అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కూడా సంరక్షణ అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం పంప్ ఆపరేటర్లకు టూల్ కిట్లు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ సీఈ శివప్రసాద రాజు, ఈఈ శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కారణంగా ఏమైనా మార్పులు చేస్తే వాటి వివరాలను బీఎల్ఓల ద్వారా ఓటర్లకు తెలియజేస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ, రివిజన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా కేంద్రాల్ని మార్చాల్సి వస్తే వాటిని పార్టీల ప్రతినిధులకు, స్థానిక ఓటర్లకు తెలియజేస్తామన్నారు. బీఎల్ఓలు కూడా కేంద్రం పరిధిలోని ఓటర్లకు వివరించి, వారి నుంచి సంతకాలు కూడా తీసుకోవాలని ఆమె సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు కూడా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్ని మరొకసారి పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 25 వరకు తూర్పు నియోజకవర్గంలో 339, పశ్చిమ నియోజకవర్గంలో 510 వివిధ క్లెయిమ్స్ అందాయని, వాటిని బీఎల్ఓలు, సూపర్‌వైజరీ అధికారులు క్షేత్ర పరిశీలన చేసిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్ఓలు ప్రదీప్ కుమార్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు ప్రసాద్, పద్మ, వైఎస్సార్‌సీపీ నుంచి డి.జానీ బాష, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి పాండురంగ విఠల్, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి డి.బాలాస్వామి పాల్గొన్నారు.